# పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం



హోమ్‌గార్డ్ అలీబిన్ సయ్యద్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

- ఎస్పీ అఖిల్ మహాజన్
- హోమ్‌గార్డ్ కుటుంబానికి ఆర్థికసాయం

తెలంగాణ చౌక్, డిసెంబర్ 5: జిల్లాలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ కుటుంబాలకు అన్ని రకాలుగా అండగా ఉంటామని ఎస్పీ అఖిల్ మహాజన్ భరోసానిచ్చారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన హోంగార్డు కుటుంబానికి జిల్లా పోలీస్ యంత్రాంగం ఆధ్వర్యంలో ఆర్థిక సాయాన్ని ఎస్పీ అఖిల్ మహాజన్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో ఇటీవల మరణించిన అలీబిన్ సయ్యద్ కుటుంబానికి రూ. 1,20,000 అందజేశామన్నారు. జిల్లాలోని పోలీస్ సిబ్బంది ముందుకు వచ్చి స్వచ్ఛందంగా అండగా నిలవడంపై సంతోషం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని రకాల ప్రయోజనాలను వెంటనే వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు. ఇక్కడ ఆర్ఐలు యాదగిరి, మధుకర్, రమేశ్, సీఐ రవీందర్ ఉన్నారు.

### షీ టీంతో మహిళలకు భద్రత

విద్యాసంస్థలు, రద్దీ ప్రదేశాల్లో షీ టీమ్స్ నిరంతరం నిఘా ఏర్పాటు చేసి మహిళలకు భద్రత కల్పిస్తున్నాయని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. మంగళవారం నవంబర్‌లో షీ టీం ఆధ్వర్యంలో నమోదైన కేసుల వివరాలను వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా షీ టీం బృందాల ఆధ్వర్యంలో విద్యాసంస్థలు, రద్దీప్రదేశాల్లో 86 అవగాహన సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు. వేధింపులకు గురైన వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 4 ఎఫ్ఐఆర్‌లు, 2 పెట్టి కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎక్కడైనా, ఎప్పుడైనా మహిళలు వేధింపులకు గురైతే వెంటనే 87126-56425, డయల్ 100 కాల్ చేసి సమాచారం అందజేయాలని సూచించారు.

## సంపత్‌రెడ్డి మృతి బాధాకరం: తోట ఆగయ్య



సంప్‌త్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాయకులు

సిరిసిల్ల టౌన్, డిసెంబర్ 5: బీఆర్ఎస్ జనగామ జిల్లా అధ్యక్షుడు, జడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి మరణం బాధాకరమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన పాగాల సంపత్‌రెడ్డి చిత్రపటం వద్ద నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. ఇక్కడ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, నాయకులు కుంబాల మల్లారెడ్డి, మ్యాన రవి, దార్ల సందీప్, అన్నారం శ్రీనివాస్, కోడి అంతయ్య, సామల శ్రీనివాస్, దుమాల శ్రీకాంత్, జూపల్లి రాజేశ్వర్‌రావు, గుడ్ల బాలకిషన్ ఉన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

గంభీరావుపేట, డిసెంబర్ 5: మండల కేంద్రంలో ఎంపీటీసీ నాగారపు భాగ్య కుటుంబాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పరామర్శించారు. నాగారపు దేవేందర్ తల్లి లక్ష్మి 15 రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని మంగళవారం పరామర్శించి, లక్ష్మి చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఇక్కడ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాపాగారి వెంకటస్వామిగౌడ్, పట్టణాధ్యక్షుడు పెద్దవేని వెంకటియాదవ్, ఏఎంసీ వైస్ చైర్మన్ గోగు లింగంయాదవ్, నేతలు కొమిరిశెట్టి లక్ష్మణ్, వహీద్, మీను, రాజు, వికాస్ ఉన్నారు.

## గంభీరావుపేటలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

గంభీరావుపేట, డిసెంబర్ 5: మండల కేంద్రంలోని శ్రీ మహంకాళీ మహాలక్ష్మీ, భూలక్ష్మీ అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. లోక కల్యాణార్థం శ్రీ కాళీ మహాలక్ష్మీ, భూలక్ష్మీ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను మూడు రోజుల పాటు నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ మల్లుగారి నర్సాగౌడ్ తెలిపారు. మొదటి రోజు వరుణానయనం, యాగశాల ప్రవేశం, గోపూజ, గణపతి, అఖండ దీపస్థాపనం, అగ్ని ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలను వేదపండితులు నిర్వహించారు. హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## జాతీయ బాలల సైన్స్ ప్రదర్శనకు దమ్మన్నపేట పాఠశాల విద్యార్థిని

గంభీరావుపేట, డిసెంబర్ 5: దమ్మన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని వినీల 31వ జాతీయ బాలల సైన్సు ప్రదర్శనకు ఎంపికైంది. రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి నాలుగు ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొన్నాయి. దమ్మన్నపేట పాఠశాల నుంచి 9వ తరగతి చదువుతున్న వినీల రూపొందించిన రుతుబంధన్ ప్రాజెక్టు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని జిల్లా విద్యాధికారి రమేశ్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో 132 ప్రాజెక్టులు పాల్గొనగా అందులో 13 జాతీయ స్థాయికి ఎంపికయ్యాయి. ఈ సందర్భంగా వినీలను జిల్లా విద్యాధికారి రమేశ్, పాఠశాల హెచ్ఎం వెంకటేశ్వర్‌రావు, సైన్స్ ఉపాధ్యాయుడు తాడూరి సంపత్ ప్రత్యేకంగా అభినందించారు.



రాష్ట్ర స్థాయి పోటీలో ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థిని వినీల

## ప్రీ, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్, డిసెంబర్ 5: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాలు, కళాశాలల్లో చదువుతున్న దివ్యాంగులైన విద్యార్థులు ఉపకార వేతనాలకోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటి నుంచి 10 వ తరగతి చదువుతున్న దివ్యాంగులు ప్రీమెట్రిక్, ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల దివ్యాంగ విద్యార్థులు పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల కోసం http;//scholarships.gov.in వెబ్‌సైట్‌లో ఈ నెల 31 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు తోపాటు ఆదాయం, కులం, నివాస ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు -2, ఆధార్‌కార్డు, వైకల్య ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్ జతచేయాలన్నారు. ఇతర వివరాలకు జిల్లా సంక్షేమాధికారి కార్యాలయం, జీ-33, సమీకృత జిల్లా అధికారుల కార్యాలయం (కలెక్టరేట్)లో సంప్రదించాలని సూచించారు.

## చోరీ కేసులో ఒకరికి మూడేళ్లు జైలు

గాంధీచౌక్, డిసెంబర్ 5: వృద్ధురాలి మెడలో నుంచి పుస్తెల తాడు లాక్కొని వెళ్లిన కేసులో ఒకరికి మూడేళ్లు జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ మంగళవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. గత ఏడాది జనవరి 23న తంగళ్లపల్లి మండలం చిన్నలింగాపూర్ గ్రామానికి చెందిన ఏనుగు కమలమ్మ (80) ఇంట్లో ఒంటరిగా ఉండగా సిద్దిపేటకు చెందిన అల్లెపు కృష్ణ ఆమె మెడలో నుంచి పుస్తెలతాడు, ఇంట్లో ఉన్న రూ. 10 వేలను లాక్కొని వెళ్లాడు. కమలమ్మ ఫిర్యాదు మేరకు తంగళ్లపల్లి పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడు అలెపు కృష్ణను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. విచారణాధికారిగా సీఐ ఉపేందర్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ చలుమల్ల సందీప్ వాదించగా కోర్టు మానిటరింగ్ ఎస్ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ పబ్బ తిరుపతి సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో నిందితుడికి శిక్ష విధించారు

## అనంతారంలో బొడ్రాయి ఉత్సవాలు

ఇల్లంతకుంట , డిసెంబర్ 5 : మండలంలోని అనంతారంలో మంగళవారం బొడ్రాయి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా గ్రామస్తులు బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా వెళ్లి బొడ్రాయి నిర్మాణం వద్ద నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



అనంతారంలో బొడ్రాయి ఉత్సవాల్లో పాల్గొన్న మహిళలు

# అభివృద్ధి ప్రదాతకు అండగా సిరిసిల్ల



ముస్తాబాద్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు

**నియోజకవర్గ ప్రజలు, పార్టీ శ్రేణులకు బీఆర్ఎస్ నేతల కృతజ్ఞతలు**

ముస్తాబాద్, డిసెంబర్ 5: అభివృద్ధి ప్రదాత రామన్నకు అండగా నిలిచిన నియోజకవర్గ ప్రజలకు ముస్తాబాద్ పట్టణ బీఆర్ఎస్ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 3న వెలువడిన ఫలితాలపై మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం పార్టీ శ్రేణులతో కలిసి సమావేశం నిర్వహించి మాట్లాడారు. సిరిసిల్ల నియోజకవర్గ ప్రజలు పనిచేసిన నాయకుడిని గుర్తుంచుకొని ఐదోసారి ఎమ్మెల్యేగా గెలిపించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, పదవిలో ఉన్న రోజుల్లో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలు గుర్తిస్తారన్నారు. కేటీఆర్‌కు దాదాపు 30 వేల మెజార్టీ ఇచ్చిన నియోజకవర్గ ఓటర్లు, పనిచేసిన పార్టీ శ్రేణులు, వివిధ కులసంఘ నాయకులు, ప్రజలకు మండల పార్టీ పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జనగామ జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు పాగాల సంపత్‌రెడ్డి గుండెపోటుతో మృతి చెందడంతో సంతాపం ప్రకటించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సమావేశంలో పట్టణాధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి, సహకార సంఘాల అధ్యక్షులు తన్నీరు బాపురావు, అన్నం రాజేందర్‌రెడ్డి , నాయకులు సంతోష్‌రావు, సర్వర్ పాషా, నవాజ్, మెంగని మనోహర్, శీలం స్వామి, పూస బాలయ్య, గూడూర్ భరత్, కోడె శ్రీనివాస్, చెవుల మల్లేశ్‌యాదవ్, అబ్రవేని సాయిలు, చుంచు మహేశ్, కృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

# న్యూట్రిషన్ కిట్లను సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా మహిళా ఆరోగ్య ప్రోగ్రాం అధికారి డాక్టర్ రజిత**



గర్భిణికి న్యూట్రిషన్ కిట్ అందజేస్తున్న డాక్టర్ రజిత

ఇల్లంతకుంట, డిసెంబర్ 5 : గర్భిణులు ప్రభుత్వం అందజేస్తున్న న్యూట్రిషన్ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మహిళా ఆరోగ్య ప్రోగ్రాం అధికారి డాక్టర్ రజిత సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి, గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానలో మహిళలందరికీ విట్ 3డీ, విట్ బీ12, సీబీపీ, సీఆర్‌పీ, జ్వర ప్రొఫైల్, టీఎఫ్‌టీ, ఎల్ఎఫ్‌టీ, లిపిడ్ ప్రొఫైల్‌తోపాటు థైరాయిడ్ పరీక్షలను ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు. మహిళలు దవాఖానలో అందిస్తున్న ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలకు పలు వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ శరణ్య, ఆయూష్ డాక్టర్ శరణ్య, డాక్టర్ కట్ట రమేశ్, ఎన్‌సీడీ జిల్లా అధికారి ప్రతాపరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.